క్లుప్తంగా

బోరు పూడిస్తే చర్యలు

గండేడ్: తాగునీటి బోరును పూడిస్తే కేసు నమోదు చేయిస్తామని ఎంపీడీఓ దేవన్న పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని పగిడ్యాల్, బల్సుర్‌గొండలో పర్యటించారు. పగిడ్యాల్ చెంచుకాలనీలో ఉన్న బోరును ఓ వ్యక్తి రాళ్లు వేసినట్లు ఎంపీడీఓకు స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఓ ఆయన మాట్లాడారు. వెంటనే అందులో రాళ్లను తొలగించి బోరును పునరుద్ధరించాలని పేర్కొన్నారు. అక్కడ నీరు వృథా చేయకుండా దానిని ట్యాంకు కలిపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బోరును పూడ్చినా, ధ్వంసం చేసిన అందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం రెండు గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించారు.

బీజేపీ నాయకుల ప్రచారం

హన్వాడ : బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణకు మద్దతుగా శుక్రవారం మండలంలోని వేపూర్, గొండ్యాలలో నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పాలమూరు అసెంబ్లీ ఇన్‌చార్జి రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి పార్టీ చేరికల మీద ఉన్న శ్రద్ధ ప్రజల సమస్యల పరిష్కారంపై లేదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిందని అన్నారు. కార్యక్రమంలో వెంకటయ్య, రమేష్‌కుమార్, కొండ బుచ్చన్న, రఘు రాముగౌడ్, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

యువ సమ్మేళనం జయప్రదం చేద్దాం

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ప్రేమ్‌రంగా గార్డెన్‌లో ఆదివారం నిర్వహించే బీజేవైఎం మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థాయి యువసమ్మేళనం జయప్రదం చేద్దామని యువమోర్చ జిల్లా అధ్యక్షుడు తిరుపతి పిలుపునిచ్చారు. శుక్రవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమానికి అభ్యర్థి డీకే అరుణ, ఆచారి, టీమ్ సాయి, మహేందర్, పలువురు హాజరవుతారన్నారు.

కిసాన్‌మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాలకృష్ణ

బీజేపీ కిసాన్ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన యంబి. బాలకృష్ణను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి నియామక పత్రం విడుదల చేశారు. ఈ మేరకు ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి నియామకపత్రాన్ని బాలకృష్ణకు శుక్రవారం అందజేశారు.

ప్రతి గ్రామంలో మే డే నిర్వహించాలి



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: గ్రామ గ్రామాన మే డే ఉత్సవాలు నిర్వహించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రామ్మోహన్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని ధర్మాపూర్, బొక్కలోనిపల్లి, అడవివెంకటాపురం, బండమీదిపల్లిలో సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 1న మే డేను విజయవంతం చేయాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ పదేళ్లలో రైతాంగ, కార్మిక, ప్రజల సమస్యలను ఏ మాత్రం పరిష్కరించలేదని ఆరోపించారు. భారత్ వెలిగిపోతుంది.. అచ్చాదిన్ ఆయేగ, విశ్వగురు, ఆత్మనిర్భర్ భారత్, మేక్ ఇండియా వంటి మోసపూరిత నినాదాలు ఇచ్చినా ఏమీ ఒరగలేదని విమర్శించారు. ప్రధాని నరేంద్రమోదీ విధానాలతో మధ్య తరగతి ప్రజల జీవితాలు అతుకుల బతుకులుగా మారాయన్నారు. మరోవైపు కార్పొరేట్ సంస్థల లాభాలు గరిష్ట స్థాయికి చేరాయన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించాలని కార్మికులు, కర్షకులు, ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం మేడే వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. నరసింహ, లక్ష్మయ్య, కేశవులు, కృష్ణయ్య, అబ్దుల్లా, శివ, మేస్త్రీ రాజు, రవి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వార్షిక బ్రహ్మోత్సవాలు



నారాయణపేట రూరల్: మండలంలోని సింగారంలో భవాని మాత ఆలయంలో శుక్రవారం వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు.. అమ్మవారికి అష్టోత్తర కళాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆలయం నుంచి 108 కళశాలతో మహిళలు, బాలికలు శోభాయాత్రగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. భక్తి సంకీర్తనలు, భజనలతో ఊరేగింపు అమ్మవారి నామస్మరణతో సాగింది. అనంతరం ఆలయంలో అమ్మవారికి పంచామృతాభిషేకం, అర్చన, పుష్పాలంకరణ, హారతి తదితర పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో కుంకుమార్చన చేశారు. అంతకు ముందు భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

పాలమూరు గులాబీమయం



మాచారం శివారులో హోటల్ వద్ద టీ తాగేందుకు బస్సు దిగుతున్న కేసీఆర్



బాలానగర్‌లో ప్రజలకు అభివాదం చేస్తున్న కేసీఆర్

- కేసీఆర్ రోడ్‌షోకు అనూహ్య స్పందన
- బీఆర్‌ఎస్ శ్రేణుల్లో నూతనోత్సాహం
- దారిగుండా జన నీరాజనం

పాలమూరు/జడ్చర్ల/బాలానగర్/నవాబుపేట/మహబూబ్‌నగర్ న్యూటౌన్: బీఆర్‌ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు బస్సు యాత్రకు మహబూబ్‌నగర్‌లో అనూహ్యమైన స్పందన లభించింది. పిస్తాహౌజ్, శ్రీనివాస్‌కాలనీ, మెట్టుగడ్డ, న్యూటౌన్ చౌరస్తా, బస్టాండ్ చౌరస్తా, అశోక్‌టాకీస్ చౌరస్తాల మీదుగా క్లాక్‌టవర్‌కు చేరుకున్న కేసీఆర్‌కు అడుగడుగునా జననీరాజనం లభించింది. దారి గుండా జనాలకు అభివాదం చేస్తూ బస్సులో ముందుకు సాగిన బస్సు యాత్రలో భారీగా బైకులు, వాహనాలతో నిండిపోయింది. వివిధ గ్రామాల నుంచి పెద్దఎత్తున తరలివచ్చిన జనంతో పాలమూరు పట్టణం ప్రధాన రహదారులన్నీ నిండిపోయాయి. క్లాక్‌టవర్ చౌరస్తాలో కార్నర్ మీటింగ్‌లో సభ జనంతో నిడిపోయి కిక్కిరిసింది. యాత్ర పాలమూరులో విజయవంతం కావడంతో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో నూతనోత్సాహం నిండింది. కార్నర్ మీటింగ్ ముగించుకొని వన్‌టౌన్ మీదుగా పట్టణానికి సమీపంలో కలెక్టరేట్ ముందున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఫాం హౌస్‌కు చేరుకున్నారు. శుక్రవారం రాత్రి బస అక్కడే చేసి శనివారం నాగర్‌కర్నూర్‌కు బయలుదేరనున్నారు.

మాజీ సీఎం కేసీఆర్‌కు జడ్చర్లలో శుక్రవారం ఘన స్వాగతం లభించింది. స్థానిక ఫ్లై ఓవర్ బ్రిడ్జి దగ్గర బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు కేసీఆర్ బస్సుయాత్రకు స్వాగతం పలికారు. కేసీఆర్ బస్సులో నుంచే అభివాదం చేశారు. అంతకు ముందు ఆయన మాచారం శివారులోని మినర్వ హోటల్ వద్ద తేనీటి విందు కోసం దాదాపు గంట పాటు ఆగారు. హోటల్‌లో ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్‌రెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, అంజయ్య యాదవ్, రాజేందర్‌రెడ్డిలతో ఆయన సమావేశమయ్యారు.

అభివాదంతో ముందుకు సాగిన కేసీఆర్

హైదరాబాద్ నుంచి బాలానగర్ మీదుగా పాలమూరుకు సాగిన కేసీఆర్ బస్సు బాలానగర్ మండల కేంద్రానికి సాయంత్రం 5:25 గంటలకు చేరుకుంది. ఈ సందర్భంగా అంతకుముందు నుంచే కేసీఆర్ కోసం వేచి ఉన్న ప్రజలు డీజే పాటలకు డ్యాన్సులు చేస్తూ ఆడి పాడారు. ప్రజలకు అభివాదం చేస్తూ జాతీయ రహదారిపై ముందుకు సాగారు.

కేసీఆర్ పర్యటనకు ప్రత్యేక భద్రత

మాజీ సీఎం కేసీఆర్ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో బస్సు యాత్రలో భాగంగా శుక్రవారం రాత్రి 7:15గంటలకు మెట్టుగడ్డ వద్దకు చేరుకున్నారు. బీఆర్‌ఎస్ శ్రేణులు కేసీఆర్‌కు స్వాగతం పలకడానికి అక్కడికి భారీగా చేరుకున్నారు. పట్టణంలో కేసీఆర్ పర్యటన నేపథ్యంలో జిల్లా అదనపు ఎస్పీ రాములు, డీఎస్పీ వెంకటేశ్వర్లు బందోబస్తును పర్యవేక్షించారు. మెట్టుగడ్డ నుంచి క్లాక్‌టవర్ వరకు ప్రత్యేక రోప్ ఏర్పాటు చేసి బస్సు వెంటనే స్పెషల్ పార్టీ పోలీసులు భద్రత కల్పించారు. ప్రధాన రోడ్డు వెంట ఉన్న కూడళ్లు, చౌరస్తాలలో పోలీసులు విధులు నిర్వహించారు. కేసీఆర్ పట్టణంలోకి వచ్చిన తర్వాత ట్రాఫిక్ డైవర్షన్ సక్రమంగా చేయకపోవడం వల్ల వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

తరలిన నాయకులు

కేసీఆర్ రోడ్ షో సందర్భంగా శుక్రవారం నవాబుపేట మండలం నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులు తరలి వెళ్లారు. కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ నాయకులు నర్సింహులు, రవీందర్‌రెడ్డి, లక్ష్మయ్య, అనంతయ్య, ప్రతాప్, గోపాల్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే సకలజనుల అభివృద్ధి

బాలానగర్: కాంగ్రెస్‌తోనే సకలజనుల అభివృద్ధి సాధ్యమని, ప్రస్తుతం మౌలిక సదుపాయల కల్పనతోపాటు విద్య, వైద్యంపై అధిక నిధులు వెచ్చించి ప్రజలకు తోడ్పాటుగా ఉంటామని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని బిల్డింగ్‌తండా, హేమాజిపూర్, లింగారం, నేలబండతండా, బోడగుట్ట తండా, పెద్దరేవల్లిలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డితో కలిసి పార్టీ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పలు గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ప్రతి గ్రామంలో కొత్త రేషన్ కార్డుల జారీ పూర్తి చేసి మహిళలకు రూ.2,500 హామీ, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల కోడ్ కారణంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కూడా ఆగిపోయిందని ఎన్నికలు పూర్తి అయిన వెంటనే విద్యుత్‌బిల్లులు చెల్లించాల్సిన పని లేదని గుర్తు చేశారు. లంచం తీసుకునే అధికారుల భరతం పడతామని రైతులు, సామాన్య ప్రజలు తమ పనుల కోసం ఎవరికీ లంచం ఇవ్వాల్సిన పనిలేదన్నారు.



హేమాజిపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే రూ.160 కోట్లతో బీటీ రోడ్ల పనులు మంజూరు చేయించానని చెప్పారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు 20వేల బూట్లను పంపిణీ చేస్తామని అన్నారు. ప్రతి పాఠశాలలో టీవీలతో ఆన్‌లైన్ విద్యాబోధనకు ఏర్పాట్లు స్నేహితుల సహకారంతో చేసేందుకు కృషి చేస్తున్నానని అన్నారు. ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిని గెలిపిస్తే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మరిన్ని నిధులు నియోజవర్గానికి తెస్తానని చెప్పారు.

నేడు జాబ్‌మేళా

మహమ్మదాబాద్: మండలంలోని నంచర్లగేట్ పల్లవి కళాశాలలో శనివారం జాబ్‌మేళా ఏర్పాటు చేసినట్లు ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ పద్మనాభం ప్రకటనలో తెలిపారు. షాబాద్ మండలంలోని మెఘా ఇంజినీరింగ్ కంపెనీలో పనిచేసేందుకు అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు ఈ జాబ్‌మేళా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన వారికి ఉద్యోగంతో పాటు శిక్షణ, జీతం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఐటీఐలో వివిధ రకాల కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించిన పురుష అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి కలవారు వారి బయోడేటా, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలు, విద్యార్హత పత్రాలు, బ్యాంకుఖాతా నంబరు, జిరాక్స్ పత్రాలతో హాజరుకావాలని కోరారు. 30ఏళ్లలోపు వారు అర్హులని పేర్కొన్నారు.

శివాజీ విగ్రహం ఆవిష్కరణ

నవాబుపేట: మండలంలోని కేశవరావుపల్లిలో శుక్రవారం ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. దేశంలో హిందూ సంస్కృతిని కాపాడేందుకు నాడు శివాజీ చేసిన పోరాటం ఆదర్శమన్నారు. ఛత్రపతి ధైర్య సాహసాలు యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అభిమన్యు రెడ్డి, రఘు, రమేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మండలంలోని మణికొండ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. సీడీపీఓ శాంతిరేఖ హాజరై మాట్లాడారు. గర్భిణులు, చిన్నారుల తల్లులు అంగన్‌వాడీ కేంద్రాల సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సరితారాణి, ఏఎన్‌ఎం శాంత, అంగన్‌వాడీ టీచర్‌లు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: మండలంలోని కోడ్గల్ ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలోని లక్ష్మీనాయక్, గైరాన్‌తండా కేంద్రాల్లో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న విద్యార్థులకు పట్టాలు అందజేశారు.



మణికొండలో గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న సీడీపీఓ శాంతిప్రియ తదితరులు

పాఠశాల విద్యాభ్యాసం కోసం వారిని ప్రోత్సహించారు. కార్యక్రమంలో టీచర్లు కృష్ణమ్మ, సరస్వతి, మేఘమాల, జయమ్మ, భాగ్య పాల్గొన్నారు.

యూత్‌కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నియామకం

బాలానగర్: నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా మోతీఘణాపూర్ చెందిన ప్రవీణ్ కుమార్‌యాదవ్ శుక్రవారం నియాకమయ్యారు. ఆయన మాట్లాడుతూ.. పార్టీ కోసం అహర్నిషలు పనిచేసిన గుర్తించి పదవిని కట్టబెట్టిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పల్లెల్లో వెల్లివిరిసిన ఆధ్యాత్మికం



చిన్నచింతకుంటలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి దంపతులు

చిన్నచింతకుంట: మండలంలోని చిన్నవడ్డేమాన్ రామ లింగేశ్వర స్వామి ఉత్సవాలు ముగిశాయి. నాలుగు రోజుల పాటు వైభవంగా కొనసాగిన ఉత్సవాలలో శుక్రవారం చివరి రోజు గిరిజా కల్యాణం ఆలయ ప్రధాన అర్చకుడు జంగం వీరేశం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం ఆలయంలో శివలింగానికి రుద్రాభిషేకం నిర్వహించి పూజలు చేశారు. అనంతరం శివ పార్వతుల ఉత్సవ విగ్రహాలను మేళ తాళాల మధ్య కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. విగ్రహాలకు పట్టు వస్త్రాలతో అలంకరించి కల్యాణం అంగరంగ వైభవంగా జరిపించారు. ఈ వేడుకకు మండలంలోని ప్రజలు హాజరై కనులారా వీక్షించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి దంపతులతో పాటు కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి సతీమణి చల్లా అక్షేష హాజరై శివ పార్వతులకు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు.

భూత్పూర్: మండలంలోని లంబడికుంటలో శుక్రవారం ఆంజనేయస్వామి ఆలయం ఎదుట ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపనకు మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

నవాబుపేట: మండలంలోని కొత్తకుంటతండా, కేశవరావుపల్లి, రుద్రారంలో ధ్వజస్తంభ, విగ్రహాస్థాపన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, అభిమన్యురెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

హన్మసానిపల్లి దేవాలయానికి భూమి పూజ

హన్మసానిపల్లి హనుమాన్ దేవాలయానికి డీసీసీ అధికార ప్రతినిధి దుశ్యంత్‌రెడ్డి భూమి పూజ చేశారు. శుక్రవారం ఆయన గ్రామంలో ప్రత్యేక పూజలు చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఆయన వెంట భూపాల్‌రెడ్డి, సత్యయ్యగౌడ్, ఆంజనేయులు, కుమార్, సత్యం, వెంకటేష్, నర్సింహ, వెంకటయ్య తదితరులు ఉన్నారు.



కాటవరం శివాలయంలో చిన్నారెడ్డిని సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ఠ

అడ్డాకుల: మండలంలోని కాటవరంలో విగ్రహాల ప్రతిష్ఠన కార్యక్రమాలను గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక శివాలయం వద్ద విఘ్నేశ్వరుడు, శివుడు, ఆంజనేయస్వామి, కుమారస్వామి, అమ్మవారు, నవగ్రహాలు, నాగులు, నందిశ్వరుడి విగ్రహంతో పాటు ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన కార్యక్రమాలను మూడు రోజులుగా చేపట్టారు. రెండు రోజుల పాటు పూజలు నిర్వహించిన అనంతరం మూడో రోజైన శుక్రవారం పండితులు ప్రత్యేక పూజలు చేసి విగ్రహాల ప్రతిష్ఠను నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి హాజరై విగ్రహాల ప్రతిష్ఠలో పాల్గొన్నారు. ప్రతిష్ఠ అనంతరం విగ్రహాలకు పూజలు చేశారు. విగ్రహాల ప్రతిష్ఠను పురస్కరించుకుని గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

రాజ్యాంగ రక్షణ సభకు తరలిరావాలి



మాట్లాడుతున్న పాస్టర్ గిద్యోన్

చిన్నచింతకుంట: రాజ్యాంగ పరిరక్షణకై శనివారం మహబూబ్‌నగర్‌లో నిర్వహించే బహిరంగసభకు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మండల కేంద్రంలోని ఎంబీసీ యోన్ చర్చి పాస్టర్ గిద్యోన్, సంఘ అధ్యక్షుడు మోష కోరారు. శుక్రవారం చర్చిలో సంఘ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కొందరు రాజకీయ పార్టీల నాయకులు రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. అందుకు బడుగు బలహీన వర్గాల ప్రజలు ఏకమై వారి కుట్రలను తిప్పి కొట్టాలన్నారు. జిల్లా కేంద్రంలోని ఎంబీసీ గ్రౌండ్‌లో నిర్వహించే సభకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాజులు, సుదర్శన్, పిలోగు, శేఖర్, ప్రతాప్, యాకోబ్, అబ్రహం పలువురు ఉన్నారు.

పొగ మంచు కాదు.. దుమ్ము



జడ్చర్లలో పొగమంచును తలపిస్తున్న దుమ్ము

ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలు

జడ్చర్ల: ఈ ఫొటోలను చూస్తే శీతాకాలంలో కమ్మేసిన పొగమంచులా కనిపిస్తుంది కదూ.. రహదారిపై కనికనిపించని విధంగా ఉండి వాహనాలు లైట్లు వేసుకుని ప్రయాణిస్తున్న పరిస్థితి పట్టణంలో నెలకొంది. 167వ నంబర్ జాతీయరహదారిపై మిట్ట మధ్యాహ్నం వాహనాల రాకపోకల పరిస్థితి దారుణంగా తయారైంది. ఇక్కడ సిగ్నల్‌గడ్డకు అటు ఇటుగా రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. దాదాపు రెండేళ్లుగా ఈ పనులు సాగుతున్నాయి. రోడ్డుపై కంకర పోసి వదిలేయడంతో వాహనాల రాకపోకల సమయంలో దుమ్ము దిమ్మ తిరిగేలా చేస్తుంది. ముఖ్యంగా బైక్‌లపై వెళ్లే వారికి కంకర పౌడర్ కళ్లు, ముక్కు, చెవుల్లోకి వెళ్తుంది. చుట్టు పక్కల ఇళ్లల్లో ఉంటున్న వారి బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఎప్పటికప్పుడు దుమ్ము లేవకుండా నీటిని పిచికారి చేపట్టాలని, పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

యువతి అదృశ్యం

జడ్చర్ల: పట్టణంలో బంధువుల ఇంట్లో శుభకార్యానికి వచ్చిన ఓ యువతి అదృశ్యమైంది. ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గ జిల్లా మాడిగికి చెందిన రేణుక ఈనెల 24న లక్ష్మీనగర్‌కాలనీలో బంధువుల పెళ్లికి హాజరైంది. అయితే ఈమెకు మతిస్థిమితం సరిగా లేకపోవడంతో బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టు పక్కల వెతికినా ప్రయోజనం లేకపోయింది. తండ్రి జెట్టి రాంచరణ్ శుక్రవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పొంగి పొర్లుతున్న మురుగు



కృష్ణా టెంపుల్ చౌరస్తాలో రోడ్డుపై మురుగు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక ఏడో వార్డు పరిధిలోని కృష్ణా టెంపుల్ చౌరస్తాలో రోడ్డుపై మురుగు పొంగి పొర్లుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఈ ప్రాంతంలో డ్రెయినేజీ నిర్మించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందన్నారు. ఎత్తు ప్రదేశంలో ఉన్న ఇళ్ల నుంచి మురుగు నేరుగా రోడ్డుపైకి రావడంతో వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా పెద్ద వాహనాల రాకపోకలప్పుడు మురుగు, బురద పాదచారులపై పడుతోంది. దీంతో అటువైపు నడవాలంటేనే జంకుతున్నారు. ఈ విషయాన్ని కౌన్సిలర్ కట్టా రవికిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళితే త్వరలో సమస్యను పరిష్కరిస్తామన్నారు. అలాగే మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులను అడిగితే ఎన్నికల కోడ్ ముగిశాక పరిశీలిస్తామనడం గమనార్హం.

కొత్త పంచాయతీల్లో రేషన్ తిప్పలు



రేషన్ సరుకుల కోసం రంగారెడ్డిగూడకు వెళ్తున్న తండావాసులు

- సరుకులు కోసం నాలుగు కిలోమీటర్లు వెళ్లాల్సిందే..
- తండాల్లో రేషన్‌డీలర్‌ను ఏర్పాటు చేయాలంటున్న గిరిజనులు

రాజాపూర్: గత ప్రభుత్వం కొత్త పంచాయతీలను ఏర్పాటు చేసినా గ్రామాల్లో ఉన్న ప్రధాన సమస్యను తీర్చకపోవడంతో గిరిజన తండాల వాసులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న చౌకధరవస్తువులను ఇతర గ్రామాల్లోనే ఉన్న రేషన్ దుకాణాలకు వెళ్లి తెచ్చుకోక తప్పడంలేదు. మండలంలోని రంగారెడ్డిగూడ పంచాయతీకి అనుబంధంగా ఉన్న సింగమ్మతండాతో పాటు మరో ఆరు గిరిజన తండాలను కలిపి సింగమ్మగడ్డతండాను కొత్త పంచాయతీగా ఏర్పాటు చేశారు. మొత్తం ఈ పంచాయతీలో 1,244 మంది జనాభా ఉండగా అందులో 950 మంది ఓటర్లు ఉన్నారు. 278 రేషన్‌కార్డులు ఉన్నాయి. మరికొందరు కొత్త రేషన్‌కార్డులకోసం దరఖాస్తు చేసుకున్నారు. కొత్త పంచాయతీ ఏర్పాటు అయినప్పటికి రంగారెడ్డిగూడకు నాలుగు కిలోమీటర్లు వెళ్లి రేషన్ సరుకులు తీసుకుంటున్నారు తండాల ప్రజలు. రేషన్ సరుకులకోసం వెళ్లిన వారు జాతీయ రహదారిని దాటే సమయంలో ప్రమాదాలకు కూడా గురవుతున్నారు. రేషన్‌షాప్‌ను తమ తండాలోనే ఏర్పాటు చేయాలని ఎన్నో పర్యాయాలు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదని వారు ఆవేదన చెందుతున్నారు.

తండాలోనే బియ్యం ఇయ్యాలి



మా తండా నుంచి రంగారెడ్డిగూడకు 4కిలోమీటర్లు పోయి రేషన్ బియ్యం తెచ్చుకుంటున్నాము. ప్రభుత్వం మా తండాలోనే డీలర్‌ను ఏర్పాటు చేసి ఇక్కడే మాకు బియ్యం ఇచ్చేటట్లు చూడాలి. చాలా ఇబ్బందులు పడుతున్నాం.

– సబావట్ లక్ష్మి, సింగమ్మగడ్డతండా

ప్రాణాలు అరచేతిలో..



రంగారెడ్డిగూడకు బియ్యం కోసం పోయినప్పుడల్లా పెద్దరోడ్డు మీద కార్లు ఎక్కువ వేగంతో వస్తుంటాయి. ఇద్దరు, ముగ్గురు మా కళ్లముందే వాహనాలు గుద్ది సచ్చిపోయారు. రోడ్డు దాటాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని దాటాల్సి వస్తోంది.

– కేస్లీ, సింగమ్మతండా వాసి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



సింగమ్మగడ్డతండాలో కొత్త రేషన్‌డీలర్‌ను నియమించాలని గతంలోనే అధికారులకు నివేదికలు పంపించాం. ప్రస్తుతం ఎలక్షన్ కోడ్ అమలులో ఉంది. కోడ్ ముగిసిన తర్వాత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూస్తాం.

– విద్యాసాగర్‌రెడ్డి, తహసీల్దార్, రాజాపూర్